

లక్ష్మి నారాయణ స్వామి బ్రహ్మోత్సవాలు మొదలు... 4 లో


ప్రజాపక్షం

జిల్లా అనుబంధం

కరీంనగర్ సిరిసిల్ల పెద్దపల్లి జగిత్యాల నిర్మల్ ఆదిలాబాద్ మంచిర్యాల నిజామాబాద్ కామారెడ్డి

బుధవారం | 20 మార్చి, 2024 | పేజీలు : 06


# మండుటెండలో విద్యార్థులచే పనులు చేపించిన ఉపాధ్యాయులు





**ప్రజాపక్షం /ముత్తారం :** విద్య బుద్ధులు చెప్పాల్సిన పాఠశాల ఉపాధ్యాయులు విద్యార్థులచే సుమారు రెండు గంటలు పని చేయించిన సంఘటన పెద్దపల్లి జిల్లా ముత్తారం మండలం ఓడేడు ప్రభుత్వ పాఠశాలలో చోటుచేసుకుంది. పాఠశాలలో చదువుతున్న అభం శుభం తెలియని పసిపిల్లల తో పనులు చేయించడం ఎంతవరకు సమంజసమని విద్యార్థుల తల్లిదండ్రులు ఉపాధ్యాయుల తీరు పట్ల ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పెద్దపల్లి జిల్లా ముత్తారం మండలంలోని ఓడేడు ప్రభుత్వ పాఠశాలలో మంగళవారం విద్యార్థులచే ఉపాధ్యాయులు పాఠశాల ఆవరణలో కాంపౌండ్ వాల్ పూర్తిస్థాయిలో లేకపోవడంతో పశువులు పాఠశాల ఆవరణంలోకి రాకుండా ఉండేందుకు కాంపౌండ్ వాల్ లేని చోట విద్యార్థులచే అడ్డుగా చెట్లను నరికించి దడి (పోరుక అడ్డుగా) నాటించారు. 15 సంవత్సరాల లోపు విద్యార్థులచే పనులు చేస్తున్న ఉపాధ్యాయుల తీరు పట్ల తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పాఠశాలల అభివృద్ధి కోసం నిధులు ప్రభుత్వం సమకూరుస్తున్న వాటిని ఖర్చు చేసేందుకు పాఠశాలకు చైర్మన్ ఉన్నారు. వారికి సమాచారం ఇస్తే పాఠశాలలో నెలకొన్న సమస్యలు పరిష్కరిస్తారు. కానీ విద్యబుద్ధులు నేర్పించాల్సిన విద్యార్థులచే ఇలాంటి పనులు చేపించడం సరికాదన్నారు. విద్యార్థులచే పనులు చేయించిన ఉపాధ్యాయులపై స్థానిక ఎంఈఓ,జిల్లా కలెక్టర్, విద్యాశాఖ అధికారులు విచారణ జరిపి పాఠశాల పై చర్యలు తీసుకోవాలని విద్యార్థులు తల్లిదండ్రులు కోరుతున్నారు.



భర్తపై మాజీ భార్య యాసిడ్‌తో దాడి. 4 లో

## హైదరాబాద్ పబ్లిక్ స్కూల్‌లో 1వ తరగతి ప్రవేశానికి విద్యార్థుల ఎంపిక

**ప్రజాపక్షం/ మంచిర్యాల ప్రతినిధి :** 2024/25 విద్యా సంవత్సరానికి గాను జిల్లా గిరిజన అభివృద్ధి శాఖ ద్వారా హైదరాబాద్ పబ్లిక్ స్కూల్లో 1వ తరగతిలో ప్రవేశానికి అర్హత గల విద్యార్థులను ఎంపిక చేయడం జరిగిందని జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) సబావత్ మోతిలాల్ తెలిపారు. మంగళవారం జిల్లాలోని నస్పూర్‌లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలోని జిల్లా అదనపు కలెక్టర్ చాంబర్లో జిల్లా గిరిజన అభివృద్ధి శాఖ అధికారి గంగారాంతో కలిసి డ్రా పద్ధతిన విద్యార్థులను ఎంపిక చేశారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ గిరిజన విద్యార్థిని, విద్యార్థులకు ఉచిత విద్యాభ్యాసానికి 1వ తరగతిలో ప్రవేశాలకు జిల్లా నుండి 5 మంది విద్యార్థులను లక్కీ డ్రా ద్వారా ఎంపిక చేయడం జరిగిందని, ఎంపికైన వారిలో



గోండ్, నాయక్‌పోడ్‌కు చెందిన ఇద్దరు, లంబాడా, కొలాం, ఇతర ఉప గిరిజనులలో ఒకరి చొప్పున ఉన్నారని తెలిపారు. ఎంపికైన విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని చక్కగా చదువుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సంబంధిత శాఖల అధికారులు, విద్యార్థులు, తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

## రెవెన్యూ అధికారులకు కట్నాలు తప్ప... ఇసుక డంపులు కనిపించవా...?



6 లో

# సిర్పూర్‌టిలో భారీ వర్షం

ప్రజాపక్షం/సిర్పూర్ టి : మండలంలో మంగళ వారం రోజున ఒక్కసారిగా వాతావరణం మార్పు చెంది చల్లబడింది. పెద్ద ఎత్తున్న ఈదురు గాలు లతో వర్షం కురిసింది. ఈదురు గాలులతో కూడిన వర్షం కురవడంతో అక్కడ అక్కడ చెట్లు విరిగి రోడ్డుపై పడ్డాయి. గత వారం రోజుల నుండి విపరీతమైన ఎండ ఉండటంతో వేడిని తాళలేక ప్రజలు ఉక్కిరి బిక్కిరి అవుతున్న సమయంలో మంగళవారం కురిసిన వర్షం కొంత ఉపశమనం కలిగించింది.

# 85 వేల నగదు పట్టుకున్న సిర్పూర్ ఎస్ఐ



ప్రజాపక్షం /సిర్పూర్ టి : కొమురంభీం జిల్లా ఎస్‌పి కె. సురేష్ కుమార్ ఆదేశాల మేరకు సిర్పూర్ టి మండల కేంద్రంలో మంగళవారం ఎస్ఐ ధీకొండ రమేష్ ఆధ్వర్యంలో వాహన తని ఖీలు నిర్వహించారు. ఈ తణిఖీల్లో మంచిర్యాల్ జిల్లా చెన్నూర్‌కు చెందిన నజీర్ ఖాన్ అనే వ్యక్తి నుండి రూ. 85, 000లను స్వాధీనపర్చుకున్నట్లు ఎస్ఐ తెలిపారు. పట్టుబడిన డబ్బులకు సంబంధిం చిన సరైన పత్రాలు లేని కారణంగా సీజ్ చేసి ఎఫ్ ఎస్‌టి రఘునాథ్‌కు అప్పగించినట్టు తెలిపారు.

# పది విద్యార్థులకు అరటి పండ్ల పంపిణీ



ప్రజాపక్షం/ పెంచికల్ పేట్ : పెంచికల్ పేట్ మండలంలోని జిల్లా పరిషత్ పాఠశాలలో మంగళ వారం పదవ తరగతి పరీక్షలు రాస్తున్న విద్యార్థు లకు జాగృతి మండల మాజీ కన్వీనర్ నగునూరి శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఎంపిడిఒ గంగసింగ్ చేతులా మీదుగా విద్యార్థులకు అరటి పండ్లు పంపిణీ చేసారు. ఈ సందర్భంగా వారు మాట్లా డుతూ విద్యతోనే అభివృద్ధి చెందుతారని, విద్యా ర్థిని, విద్యార్థులు పరీక్షలు మంచిగా రాసి మండ లానికి, తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావా లని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల కో ఆప్షన్ సభ్యులు సయ్యద్ సాజిత్ మండల నాయ కులు చౌదరి తిరుపతి, లోన్కార్ రమేష్, మాజీ ఉప సర్పంచ్ రమేష్, రాచర్ల వెంకటేశ్వర్, ఉపాధ్యా యులు, యువకులు పాల్గొన్నారు.

# మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్‌ను ఉల్లంఘించరాదు

ప్రజాపక్షం/నస్పూర్ : లోక్ సభ ఎన్నికలలో భాగంగా మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ (ఎంసిసి) అమలులోకి రావడంతో నస్పూర్ మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ కమిషనర్ చిట్యాల సతీష్, తహశీల్దార్ శ్రీనివాస్, ఎస్ఐ శ్రీనివాస్‌లు సమావేశం అయ్యారు. మంగళవారం జరిగిన సమావేశంలో పట్టణంలో మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ ఉల్లంఘన జరగకుండా ఏ రాజకీయ పార్టీ లకు సంబంధించిన ఫ్లెక్సీ, బ్యానర్లను రూ. 50 వేలకు మించి రసీదు లేకుండా తీసుకెళ్లకూడదని తెలిపారు. అలాగే నస్పూర్ పట్టణ ప్రాంత ఓట ర్లకు అవగాహన సదస్సులను కల్పించే పలు కార్య క్రమాల ఏర్పాట్ల పైన చర్చించారు.

# రాష్ట్ర స్థాయి జిజ్ఞాస పోటీలకు ఎంపికైన ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు



ప్రజాపక్షం/ కాగజ్‌నగర్ : తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో చదువుతున్న విద్యార్థుల్లో పరిశోధనా నైపుణ్యాలను పెంపొందించడానికి కళాశాల విద్యాశాఖ నిర్వహిస్తున్న జిజ్ఞాస విద్యార్థి ప్రాజెక్టులలో కాగజ్‌నగర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు కంప్యూ టర్ సైన్స్ విభాగంలో రూపొందించిన ప్రాజెక్టు రాష్ట్ర స్థాయికి ఎంపికైనట్లు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డా.లక్ష్మీ నరసింహం తెలిపారు. మిషన్ లెర్నింగ్‌ని ఉప యోగించి హెల్త్ ఇన్సూరెన్స్ ఎమౌంట్‌ని అంచనా వేయడం అనే అంశంపై కంప్యూటర్ సైన్స్ అధ్యాప కులు డి. శ్రీనివాస్, సానియా సమీన్ నేతృత్వంలో విద్యార్థులు సుకన్య, నీరజ, సౌందర్య, విజయ్, రహమ త్‌లు ఈ ప్రాజెక్టును రూపొందించినట్లు తెలిపారు. వీరు త్వరలో హైదరాబాదులో జరిగే రాష్ట్ర స్థాయి పోటీలలో పాల్గొని తమ ప్రాజెక్టును ప్రదర్శించనున్నారని, ఇందులో ఎంపికైన వారికి 25000 నగదు పారితోషికం అందనుందని అన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర స్థాయికి ఎంపికైన విద్యార్థులను, వారికి మార్గదర్శకత్వం వహిం చిన అధ్యాపకులను ప్రిన్సిపాల్, ఇతర అధ్యాపకులు అభినందించారు.

## ఎస్‌సి మోర్చా రాష్ట్ర అధ్యక్షులు కొండేటి శ్రీధర్‌నుకు సన్మానం




ప్రజాపక్షం/నిర్మల్‌రూరల్ : తెలంగాణ రాష్ట్ర భార తీయ జనతా పార్టీ కార్యాలయంలో జరిగిన ఎస్సీ మోర్చా రాష్ట్ర పదాధికారుల సమావేశానికి నిర్మల్ జిల్లా దళిత మోర్చా జిల్లా అధ్యక్షుడు రాచకొండ సాగర్ హాజరై కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా విచ్చేసిన బిజెపి తెలంగాణ ఆర్గనైజింగ్ సెక్రటరీ చంద్రశేఖర్ ని శాలువాతో సన్మానించడం జరిగింది.రానున్న పార్ల మెంట్ ఎన్నికల్లో 17 స్థానాల గెలుపే లక్ష్యంగా పనిచే యాలని దిశా నిర్దేశం చేయడం జరిగింది.ప్రతి పార్ల మెంట్ నియోజకవర్గంలో మూడువేల మంది ఎస్సీ కార్యకర్తలతో సమావేశాలు ఏర్పాటు చేయాలని,ప్రతి మండలంలోని గ్రామంలో బస్తీ సంపర్క్ కార్యక్రమం నిర్వహించాలని,రేపటి నుండి జిల్లా అధ్యక్షులు,జిల్లా నాయకులు,మోర్చా నాయకులు కార్యక్రమంలో పనుల్లో నిమగ్నమై నరేంద్ర మోడీ ని మూడోసారి ప్రధా నమంత్రిగా గెలుపునకు కృషి చేయాలని పిలుపునివ్వడం జరిగింది.

## టిబిజికెఎస్‌కు సదాశివ్ రాజీనామా

ప్రజాపక్షం /ఆసిఫాబాద్ ప్రతినిధి : బిఆర్ఎస్ అను బంధ కార్మిక సంఘం టిబిజికెఎస్ జిల్లా ఉపాధ్యక్షులు సదాశివ్ మంగళవారం కార్మిక సంఘం సభ్యత్వానికి, తన పదవికి రాజీనామా చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వార్థం కోసం కొంత మంది రాజకీయ నాయకులు సంఘాన్ని నిర్వీర్యం చేస్తున్నా రని, సంఘాన్ని తాకట్టు పెట్టి మరో సంఘానికి మద్దతు తెలుపుతున్నారని, 2001 నుండి తెలంగాణ ఉద్య మంలో ఎంతో కష్టపడి తెలంగాణ సాధనకు, కార్మికుల హక్కులను కాపాడడం కోసం ఉద్యమాలు చేశానని తెలి పారు. కొంత మంది నాయకులు సంఘంలోకి వచ్చి సంఘాన్ని స్వార్థం కోసం సంఘాన్ని నిర్వీర్యం చేయ డంతో సంఘానికి రాజీనామా చేస్తున్నాని పేర్కొన్నారు. భవిష్యత్ ప్రణాళిక త్వరలో వెల్లడిస్తానని అన్నారు.

## కథల పుస్తకాలతో విద్యార్థులలో పఠన సామర్థ్యాలు పెంపు



ప్రజాపక్షం/తిర్యాణి : కథల పుస్తకాలను చదివించడం వల్ల విద్యార్థులలో పఠన సామర్థ్యాలను పెంపొందించు కోవచ్చని రూమ్ టూ రీడ్ బ్లాక్ కో ఆర్డినేటర్ శ్రీనివాస చారి పేర్కొన్నారు. మంగళవారం తిర్యాణి మండలం లోని కోలామ్ గూడ, రొంపల్లి మండల పరిషత్ ప్రాథ మిక పాఠశాలను సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు సునీల్ కుమార్ మాట్లాడుతూ కథలను చదివించడం, చెప్పించడం వల్ల విద్యార్థులల్లో ఆలోచన శక్తి, ఊహా శక్తి, సృజనాత్మక ఆలోచనలు పెరుగుతాయన్నారు. అలాగే విద్యార్థులచే నాటికను వేయించారు. అనంతరం గొండి, కొలామి కథల పుస్తకాలు అందచేసిన రూమ్ టు రీడ్ స్వచ్ఛంద సంస్థకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

## వ్యాపారస్తులు ఈ పాస్ మిషన్‌తోనే ఎరువులు అమ్మకం చేయాలి



జిల్లా వ్యవసాయ అధికారి శ్రీనివాసరావు

ప్రజాపక్షం/పెంచికల్ పేట్ : మండల కేంద్రంలోని ఎరువుల దుకాణాలను, గోదాం నిల్వలను జిల్లా వ్యవ సాయ అధికారి శ్రీనివాసరావు మంగళవారం ఆకస్మి కంగా తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా వ్యవసాయ అధికారి శ్రీనివాస్ రావు మాట్లాడుతూ ఎరు వులు దుకాణాలు గల ప్రతి వ్యాపారస్తుడు ఈపాస్ మెషిన్ తోనే ఎరువులు అమ్మాలని, లేని యెడల చర్యలు తప్పవని అన్నారు. ఈ పాస్ మెషిన్‌తో తనిఖీలో భాగంగా (ఎఫ్ఐవి ఇఎస్) నిర్వహించడం జరిగిందని తెలిపారు. ఆయన వెంట మండల వ్యవసాయ అధికారి రాజుల నాయుడు వ్యాపారస్తులు పాల్గొన్నారు.

# ప్రశాంతంగా పది పరీక్షలు



ప్రజాపక్షం/సిర్పూర్‌టి : పదవ తరగతి పరీక్షలు సోమ వారం మొదలుకాగా మండలంలో మొత్తం మూడు సెంటర్లను ఏర్పాటు చేశారు. రెండవ రోజు మండల పరి షత్ సెకండరీ పాఠశాలలో 199 మంది విద్యార్థులకు గాను 198 మంది విద్యార్థులు, టిఎస్‌డబ్ల్యూఆర్ఎస్ బాలురలో 195 మంది విద్యార్థులకు గాను 195 మంది విద్యార్థులు, టిఎస్‌డబ్ల్యూఆర్ఎస్ బాలికల పాఠ శాలలో 181 మంది విద్యార్థులకు గాను 181 మంది విద్యా ర్థులు హాజరయ్యారు. మొత్తం విద్యార్థులు 575 గాను 574 మంది విద్యా ర్థులు హాజరు కాగా ఒక్కరు గైర్హాజరు అయ్యారని మండల విద్యాశాఖ అధికారి సోమయ్య తెలిపారు. సిర్పూర్ టి ఎస్ఐ ధీకొండ రమేష్ ఆధ్వర్యంలో పరీక్ష కేంద్రాల వద్ద పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేసారు.

# చినుకు పడితే చిత్తడే

## చెరువును తలపిస్తున్న ప్రధాన రహదారి



ప్రజాపక్షం/కౌటాల : మండ లంలోని ముత్తంపేట్ పార్డి క్రాస్ రోడ్ వద్ద మంగళ వారం కురిసిన అకాల వర్షంతో కౌటాల నుండి సిర్పూర్ వెళ్ళే ప్రధాన రహదారి చెరువును తలపిస్తుంది. దాంతో రోడ్ పై వెళ్ళే వాహన దారులు నరక యాతన పడుతున్నారు. నిత్యం వందల కంకర లారీలు నడవడంతో పెద్ద పెద్ద గుంతలు పడడం, చిన్న చిన్న వర్షాలకు నీళ్ళు నిలువడంతో ఇబ్బంది పడుతున్న అధికా రులు పట్టించుకున్న పాపాన పోలేదు. ప్రధాన రహదారుల పరిస్థితి ఇలా ఉంటే ఇంకా మారుమూల ప్రాంతాల్లో రోడ్ల పరిస్థితి చెప్పన క్కర్లేదు. వాహన దారుల కష్టాలను చూసి ఇకనైనా అధికారులు స్పందించి గుంతలను పూడ్చాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

# జీతాలు రాక కుటుంబ పోషణ కష్టమవుతుంది



ప్రజాపక్షం/కడెం : ఇరిగేషన్ శాఖలో పనిచేస్తున్న(వీఆర్‌పి) లకు ఆగస్టు నెల నుండి జీతాలు రావడంలేదని ఆవేదన వ్యక్తం చేస్తు న్నారు.చాలీచాలని జీతాలతో జీవించే వారికి జీతాలు రాకపోవ డంతో కుటుంబాన్ని పోషించడం కష్టమైందని. అదే వేరే శాఖలో పనిచేస్తున్న వారికి జీతాలు వస్తున్నాయని మా విషయంలో ఎందుకు జాప్యం జరుగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు.పై అధి కారులు స్పందించి వెంటనే తమకు జీతాలు వచ్చే విధంగా చేసి తమ కుటుంబాలను ఆదుకోవాలని వారు కోరుతున్నారు.

# బంగల్‌పేట్‌లో ఉచిత వైద్య శిబిరం



ప్రజాపక్షం/నిర్మల్ టౌన్ : నిర్మల్ పట్టణంలోని బంగల్ పేట్ లో ఉన్న డబుల్ బెడ్ రూమ్ వద్ద మంగళవారం రోజున ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు.గత కొంతకాలంగా డబుల్ బెడ్ రూమ్ కాలనీలో నిరుపేదలు అనారోగ్యం పాలు అవుతున్న సంగతి తెలు సుకొని మాజీ కౌన్సిలర్ తోట నరసయ్య,పెండం శ్రీనివాస్ ఆధ్వ ర్యంలో ఉచిత వైద్య సేవలు నిర్వహించారు.ఈ కార్యక్రమంలో కొండ కాల గంగాధర్,వంజరి రమణ, చింతగంగాధర్,ప్రభు స్వామి,శ్రీహరి,కరిపె శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

# సిఐ అనిల్‌ను సన్మానించిన జిల్లా తుడుందెబ్బ కమిటీ

ప్రజాపక్షం/నిర్మల్ టౌన్ : సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో నిర్మల్ టౌన్ సిఐగా బదిలీపై వచ్చిన బి.అనిల్‌కు నిర్మల్ తుడుందెబ్బ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో సన్మానించడం జరిగిందని రాష్ట్ర ఉపాధ్యక్షులు వెంకగారి భూమయ్య అన్నారు.గతంలో నర్సాపూర్ ఎస్సైగా పనిచే సిన సందర్భంగా కమిటీ సభ్యులతో మంచి స్నేహపూర్వకంగా ఉండేవారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా కార్యదర్శి మంద మల్లేష్,జిల్లా అధ్యక్షుడు సాకి లక్ష్మణ్, కార్యదర్శులు సురపు సాయన్న, బొసని రాజేశ్వర్,రాజుల నారా యణ,తదితరులు ఉన్నారు.

# నేడు చేద్వాయి వారసంత వేలం పాట

ప్రజాపక్షం/పెంచికల్ పేట్ : పెంచికల్ పేట్ మండలంలోని చేద్వాయి గ్రామ పంచాయతీ పరిధిలో ప్రతి బుధవారం నిర్వ హించే వారసంత వేలంపాటను బుధవారం నిర్వహించనున్నట్లు మండల ప్రత్యేక అధికారి రమేష్ బాబు, గ్రామ పంచాయతీ కార్య దర్శి రాధా ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వేలం పాట బుధవారం ఉదయం 10 గంటలకు మొదలు అవుతుందని, ఆసక్తి ఉన్న వారు వేలం పాటలో పాల్గొని దక్కించుకోవాలని సూచించారు.

# మృతురాలి కుటుంబానికి బియ్యం అందజేత

**ప్రజాపక్షం/వీణవంక** : వీణవంక మండలం హిమ్మత్ నగర్ గ్రామానికి చెందిన నిరుపేద కుటుంబానికి చెందిన బండారి రాధా అనారోగ్యంతో మృతి చెందగా విషయాన్ని తెలుసుకున్న కొమ్మిడి రాకేష్ రెడ్డి తన అనుచరులను పంపించి మృతురాలు కుటుంబాన్ని పరామర్శించి కుటుంబ సభ్యులకు తన వంతు సహాయంగా 50 కెజిల బియ్యాన్ని అందజేశారు. కార్యక్రమంలో రాకేష్ రెడ్డి యువ సైన్యం వ్యవస్థాపకుడు సతీష్ కుమార్, నల్ల కొండాల్ రెడ్డి, గట్టయ్య, మోహన్ రెడ్డి, శ్రావణ్, వంశీ పాల్గొన్నారు.
వార్తకు ఫోటో ఉంది

# అస్తవ్యస్తంగా డ్రైనేజీ... ఇండ్ల మధ్యలో మురుగునీరు



**ప్రజాపక్షం/వీణవంక** : డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉండడంతో ఇండ్ల మధ్యలోకి మురుగునీరు చేరి ప్రజలు రోగాల బారిన పడుతున్నారని వీణవంక మండల కేంద్రంలోని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండల కేంద్రంలో గత నెల రోజుల క్రితం రోడ్డు విస్తరణలో బాగంగా రోడ్డుకు ఇరువైపులా ఉన్న సైడ్ డ్రైనేజీలు పూర్తిగా తొలగించడం వల్ల రెండు రోజులు కురిసిన వర్షానికి ఇండ్ల మధ్యలో డ్రైనేజీ నిండి మురుగునీరు నిల్వ ఉంటోందని, తద్వారా దోమల బెడద ఎక్కువయ్యిందని వాపోయారు. వెంటనే డ్రైనేజీ నిర్మాణం చేపట్టి ఇండ్ల మధ్యలోకి మురుగు రాకుండా చూడాలని అధికారులను వేడుకుంటున్నారు.

# ఉద్యమకారుల ఫోరం సంక్షేమ సంఘం నూతన కార్యవర్గం

**ప్రజాపక్షం/కరీంనగర్** : ఉద్యమకారుల ఫోరం సంక్షేమ సంఘం ఆద్వర్యంలో తెలంగాణ వ్యాప్తంగా నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. రాష్ట్ర గౌరవాధ్యక్షులుగా పామరాజు రామారావు, జివిస్ ఆనంద్‌లను ఎన్నుకున్నారు. స్థానిక ప్రెస్‌భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ ఉద్యమకారులతో కలిసి తమ డిమాండ్ల సాధన కోసం పోరాటం చేస్తామన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చాలని కోరారు. అంతకుముందు తెలంగాణ ఉద్యమంలో అమరులైన వారికి రెండు నిమిషాల మౌనం పాటించి శ్రద్ధాంజలి ఘటించారు.

# శివ కల్యాణ మహోత్సవ సందర్భంగా భక్తుల అర్జిత సేవలు రద్దు

**ప్రజాపక్షం/వేములవాడ :** వేములవాడ శ్రీ రాజ రాజేశ్వర స్వామి ఆలయంలో ఈనెల 27 నుండి 31వ తేదీ వరకు నిర్వహించే శివ కళ్యాణం మహోత్సవాల్లో భాగంగా స్వామి వారికి నిత్య కళ్యాణాలు, సత్యనారాయణ వ్రతాలు, చండీయాగం లాంటి అర్జత సేవలను ఐదు రోజులపాటు నిలిపి వేస్తున్నట్లు, అదేవిధంగా 28వ తేదీన నిర్వహిస్తున్న శివ కళ్యాణం సందర్భంగా ఉదయం నుండి సాయంకాలం వరకు కోడె మొక్కులను నిలిపివేస్తున్నట్లు భక్తులు ఇట్టి విషయంలో సహకరించాలని ఆలయ ఈవో కృష్ణ ప్రసాద్ కోరారు.

# శ్రీ వేణుగోపాల స్వామి బ్రహ్మోత్సవాలు ప్రారంభం

**ప్రజాపక్షం /సుల్తానాబాద్** : సుల్తానాబాద్ పట్టణం లోని శ్రీ సంతాన వేణుగోపాలస్వామీ బ్రహ్మోత్సవాలకు ఏర్పాట్లు పూర్తయ్యాయి, దేవాలయంలో ప్రత్యేక పూజలు చేసి వేడుకలను ప్రారంభించారు, ప్రత్యేకంగా నిర్మించిన యాగశాలను ఈనెల 20న ప్రారంభిస్తారు.వాసవి కన్యకా పరమేశ్వరి దేవాలయంలో బుధవారం ఎదుర్కొల్లు, శ్రీవేణుగోపాలస్వామి దేవాలయంలో స్వామివారి తిరు కళ్యాణ మహోత్సవం,నిర్వహించనున్నట్లు నిర్వాహకులు ఆలయ చైర్మన్ పల్ల మురళీధర్, పూజారి సౌమిత్రి శ్రావణ్ కుమార్, డైరెక్టర్లు లు తెలిపారు.ఈ బ్రహ్మోత్సవాల వేడుకల్లో భక్తులకు




ఏలాంటి ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేయడం జరిగిందన్నారు, మూడు రోజులపాటు జరుగు బ్రహ్మోత్సవాల్లో భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని స్వామి వారి కృపకు పాత్రులు కాగలరని వారు కోరారు.

# లక్ష్మి నారాయణ స్వామి బ్రహ్మోత్సవాలు మొదలు...



**ప్రజాపక్షం/లోకేశ్వరం** : మండలంలో బాగాపూర్ శివారులో గల రాజ్యలక్ష్మి సహిత లక్ష్మి నారాయణ స్వామి దేవాలయంలో ప్రతి సంవత్సరం మాదిరిగానే జరిగే వార్షిక బ్రహ్మోత్సవాలు మార్చ్ 22,23,24 తేదీలలో జరుగును అంగరంగ వైభవంగా జరగడానికి ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాట్లు సిద్ధమయ్యాయి, మూడు రోజుల పాటు బ్రహ్మోత్సవాలు నిర్వహించి మూడవ రోజు ఆదివారం 24వ తేదీ నాడు లక్ష్మి నారాయణ స్వామి వారికి కళ్యాణం నిర్వహించడం జరుగుతుంది. కళ్యాణం అనంతరం అన్నదాన కార్యక్రమము నిర్వహించడం జరుగుతుంది. అనంతరం స్వామివారి పల్లకి సేవగా బాగాపూర్ గ్రామంలోకి ఊరేగింపుగా స్వామివారిని ప్రధాన వీధులలో ఊరేగించడం జరుగుతుంది. అనంతరం ఆలయం వద్ద స్వామి వారికి ఏకాంత సేవ నిర్వహించడం జరుగుతుంది. లక్ష్మి నారాయణ స్వామి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకొని ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఆలయాన్ని సర్వాంగ సుందరంగా ముస్తాబు చేయడం జరిగింది.

### ఆలయ చరిత్ర

గుట్టపైన రాతి బండ పైన స్వామివారి శంకు చక్ర నామాలు పురాతన కాలంలో చెక్కబడినవి ఉన్నవి. పెద్ద పెద్ద మర్రి ఊడలతో కూడుకున్నటువంటి చెట్టు మధ్యలో ఆ రాతి పైన స్వామివారి శంకు చక్ర నామాలు గా వెలిసి ఉండడం జరిగింది. పురాతన కాలం నుండి వెలిసి ఉండడంతో గొర్రెలు కాసే కాపరిచే నామాలు ఉన్న విషయం చెప్పడంతో బాగాపూర్ గ్రామస్తులు ఆ నామాలను చూసి దర్శించి పూజలు చేస్తుండే వారు. కాలక్రమమైన నేటపాటి మాలకొండయ్య కాంట్రాక్టర్ ద్వారా స్వామివారి ఆలయం నిర్మింపబడినది, ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఆలయం అభివృద్ధి చెందడం జరిగింది.ఆలయం నిర్మించి నేటికి 12 సంవత్సరాలు ఆలయ అర్చకుడు పేరంబుదూరు సరసింహ స్వామి కర కమలం చే ప్రతినిత్యం స్వామి వారిని పూజించడం సేవించడం దీప దుప నెవేద్యం సమర్పించడం జరుగుతుంది.శంకు చక్ర నామాలతో వెలియడంతో నారాయణ గుట్టగా ప్రసిద్ధి చెందింది.లక్ష్మి నారాయణ స్వామి దేవాలయం లో తొలి ఏకాదశి ముక్కోటి ఏకాదశి,ఉగాది దసరా పండుగ రోజులలో స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించడం జరుగుతుంది.

### ఆలయ విశిష్టత

లక్ష్మి నారాయణ స్వామి రాజ్య లక్ష్మి తో ఆలయంలో కొలువు తీరని జరిగింది. ప్రతి శని సోమ గురువారాలు పౌర్ణమి ఏకాదశి రోజులలో అలాగే పండగ పర్వదినాలలో ఆలయం సందడిగా మారడం జరుగుతుంది భక్తులు తాకిడితో కిక్కిరిసిపోతుంది. పరిపాలించే శ్రీమహావిష్ణువు కావడంతో కోరిన కోరికలు నెలవేరుతాయి. అని భక్తుల దృఢనమ్మకం,పిల్లలు లేని వారికి పిల్లలు పెళ్లికానీ అమ్మాయిలకు, అబ్బాయిలకు పెళ్లిలు తొందరగా అవుతాయి.ఆరోగ్య సమస్యలు శని బాధలు తొందరగా స్వామివారి పూజించడంతో తొలగిపోతాయని భక్తుల దృఢసంకల్పం. అలయ కమిటీ,గ్రామ కమిటీ ఆధ్యర్యంలో వార్షిక బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా ప్రతి సంవత్సరం నిర్వహించి అన్నదాన కార్యక్రమం నిర్వహించడం జరుగుతుంది.మూడు రోజులపాటు హోమాలు సుదర్శన యాగము చండీయాగలు నిర్వహించడం జరుగుతుంది అలాగే గోపూజ తులసి పూజ నవగ్రహ పూజ నాగపూజ కార్యక్రమాల నిర్వహణ కూడా జరుగుతుంది.

# నాయి బ్రహ్మణ సంఘం కార్యవర్గానికి అభినందనలు



**ప్రజాపక్షం/జగిత్యాల ప్రతినిధిః** నాయి బ్రహ్మణ సంఘం నూతనంగా ఎన్నికైన అధ్యక్షులు పెండెం మహేంధర్‌తో పాటు కార్యవర్గ సభ్యులను జగిత్యాల పట్టభద్రుల ఎంఎల్‌సి , స్థానిక సంస్థల ఎంఎల్‌సీలు అభినందించారు. ఇందిరాభవన్‌కు వెళ్లిన అధ్యక్షులు పెండం మహేంధర్, సంఘ సభ్యులు ఎంఎల్‌సి తాటిపర్తి జీవన్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి పుష్ప గుచ్చం అందజేశారు ఈ సందర్బంగా మహేంధర్ సంఘ సభ్యులను ఎంఎల్‌సి జీవన్‌రెడ్డి సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఎంఎల్‌ఏ క్వార్టర్‌లో ఎంఎల్‌ఏ సంజయ్‌కుమార్‌ను మార్యద పూర్వకంగా కలవగా నూతన కార్యవర్గాన్ని అభినందించారు. జగిత్యాల మున్సిపల్ చైర్ పర్సన్ అడువాల జ్యోతిలక్ష్మణ్‌ను మహేంధర్‌తోపాటు, సభ్యులు సంఘం నాయకులు కలిసి పుష్ప గుచ్చం అందించారు. ఈ కార్యక్రమంలో నాయిబ్రాహ్మణ సేవా సంఘం జగిత్యాల నూతన కార్యవర్గం అధ్యక్షులు పెండ మహేంధర్, ఉపాధ్యక్షులు మర్రిపల్లి గంగరాజం, ప్రధాన కార్యదర్శి రాచమల్ల శ్రీనివాస్, సహాయ కార్యదర్శి మరిపెల్లి సాగర్, కోశాధికారి రాచర్ల శ్రీనివాస్, ముఖ్య నాయకులు మానాల కిషన్, గంగిపల్లి శంకర్, బ్యాండ్ రాచమల్ల బాలరాజు, కిదురుపాక నారాయణ, రాచర్ల విజయ్, పెండెం గంగారాం, పెండెం గంగాధర్, ఫ్రెష్ దరి, పెండె గంగాధర్, గంగోత్రి గంగాధర్, లారీ పెండెం గంగారాం, దేవిశ్రీ కొమురవెల్లి భూపతి, చిట్యాల కిష్టయ్య ముడపెల్లి అంజన్న వెల్లుళ్ల నాగేష్ తదితరులు ఉన్నారు

# శ్రీలోకమాత పోచమ్మ తల్లి ఆశీర్వచనాలు

## ప్రభుత్వ విప్ ధర్మపురి ఎంఎల్ఎ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్



**ప్రజాపక్షం/జగిత్యాల ప్రతినిధి** : శ్రీ లోకమాత పోచమ్మ తల్లి దేవాలయమును ప్రభుత్వ విప్ ధర్మపురి శాసనసభ్యులు అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ మంగళవారం సందర్శించారు. ఈ సందర్బంగా ఆలయ పూజారులు ప్రభుత్వ విప్‌ను పూర్ణకుంభంతో స్వాగతం పలికి ప్రత్యేక పూజలు నిర్వహించి అనంతరం వేద మంత్రములతో ఆశీర్వదించడం జరిగింది. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ మాట్లాడుతూ అమ్మ దయ ఉంటే అన్ని ఉన్నట్లే శ్రీ లోకమాత పోచమ్మ తల్లి దయతో జగిత్యాల జిల్లా ప్రజలు అందరూ ఆయురారోగ్యాలు సుఖ సంతోషాలతో సుభిక్షంగా ఉండాలని, జగిత్యాల జిల్లా వేగంగా అభివృద్ధి చెందాలని ఆకాక్షించారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ గిరి నాగభూషణం, పట్టణ అధ్యక్షులు కొత్త మోహన్, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ దుర్గయ్య, రాష్ట్ర నాయకులు బండ శంకర్, వర్తక సంఘం అధ్యక్షులు కమటాల శ్రీనివాస్, ఆలయ కమిటీ అధ్యక్షులు గాజుల రాజేంధర్, కౌన్సిలర్ ములస్తం లలితమునింధర్ , ఆలయ నిర్వాహకులు మల్లిఖార్జున్, గంగాధర్, ఐలా చంద్ర ప్రకాష్, రేపల్లె హరికృష్ణ, గాజోజు రాజగోపాలచారి, రాఘవ చారి, నాగమల్ల మనోహర్, తుమ్మనపెల్లి సుగుణకర్, ఆలయ పూజారి చరణ్ తదితరులు పాల్గొన్నారు

# భర్తపై మాజీ భార్య యాసిడ్‌తో దాడి.

**ప్రజాపక్షం/ఇబ్రహీంపట్నం** : తన భర్తపై మాజీ భార్య యాసిడ్‌తో దాడి చేసిన సంఘటన జగిత్యాల జిల్లా ఇబ్రహీంపట్నం మండలంలోని ఎర్దండి గ్రామంలో చోటుచేసుకుంది. పోలీసులు వెల్లడించిన వివరాలు ఇలా ఉన్నాయి. ఎర్దండి గ్రామానికి చెందిన నీరటి మహేష్‌తో మెట్‌పల్లి మండలం జగ్గాసాగర్ గ్రామానికి చెందిన మాస లక్షణతో 8సంవత్సరాల క్రితం వివాహం జరిగింది. వీరికి ఒక పాప ఉంది. తరచుగా మనస్పర్థలు రావడంతో ఇరువురు అంగీకారంతో కోర్టు నుండి గత సంవత్సరం విడాకులు తీసుకున్నరు. దీంతో ఇరువులు విడి విడిగా జీవిస్తున్నరు. ఈ క్రమంలో మహేష్ ఈ నెల 20న మరో పెళ్లి చేసుకోవడానికి సిద్ధం అయ్యాడు. మాస లక్షణ తన మాజీ భర్త మహేష్‌కు హానీ చేయాలని పథకం ప్రకారం మంగళవారం మహేష్ ఇంటికి వెళ్లి, మహేష్‌ను పిలిచి ఇంట్లో నుండి బయటకు రాగానే లక్షణ తన వెంట తెచ్చుకున్న యాసిడ్ బాటిల్‌తో మహేష్‌పై దాడి చేయగా వీపుపై ఎడమ కన్నుపై భాగంలో గాయాలయ్యాయి. మహేష్ పిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై అనిల్ తెలిపారు.



# ఆయిల్ పామ్ సాగుకు ప్రభుత్వరాయితీ



**ప్రజాపక్షం/చిగురుమామిడి** : ఆయిల్ ఫామ్ పంట సాగుకు ప్రభుత్వం రాయితీ కల్పిస్తున్నట్లు లోయియా ఎడిబుల్ ఆయిల్ ప్రైవేట్ లిమిటెడ్ సీఈవో సిద్దాంత్ లోహియా తెలిపారు. చిగురుమామిడి మండలంలోని ఆయిల్ ఫామ్ నర్సరీని సందర్శించారు. అనంతరం బొమ్మనపల్లిలో రైతులతో ఏర్పాటు చేసిన అవగాహన సమావేశంలో మాట్లాడారు. సాంప్రదాయ పంటలు కాకుండా పంటలను మార్పిడి చేసి అధిక లాభాలను పొందే ఆయిల్ ఫామ్ పంటను సాగుచేయాలన్నారు. జిల్లా వ్యాప్తంగా 1700 ఎకరాలు ఆయిల్ ఫామ్ సాగు చేస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వం రాయితీ కింద ఎకరానికి రూ.4200 ఇస్తున్నట్లు తెలిపారు. డ్రిప్ పరికరాలకు ఎస్సీ ఎస్టీలకు 100 శాతం, చిన్నసన్నకారు రైతులకు 90 శాతం, బిసిలకు 80 శాతం రాయితీ అందిస్తున్నట్లు తెలిపారు. ఆల్పా మొక్కలు కావాల్సిన రైతుకు ఫీల్డ్ ఆఫీసర్ మ్యాదరవేని ప్రవీణ్ కుమార్‌ను సంప్రదించాలని తెలియజేశారు. కార్యక్రమంలో రీజినల్ మేనేజర్ విజయ్ కుమార్, బొమ్మనపల్లి రైతులు కత్తుల రమేష్, ముత్యాల కొమురయ్య, తోట శ్రీనివాస దరిపెల్లి సంపత్, బండి చేరాలు, మేడుదుల కొంరయ్య, కంది శంకర్, దరిపెల్లి సంపత్, బండి రాజు, దుడ్డెల రాజు తదితరులున్నారు.

# పోలీస్ జాగీలం షాడో ను అభినందించిన ఎస్‌పి

## జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్



**ప్రజాపక్షం/సిరిసిల్ల :** ఎనిమిది నెలల పాటు ఐఐటిఏ మొయినాబాద్ నందు బేసిక్ ట్రైనింగ్ పూర్తి చేసుకుని జిల్లాకు కేటాయించబడిన పోలీస్ జాగీలం షాడో ను మంగళవారం జిల్లా ఎస్పీ, జిల్లా పోలీస్ హెడ్ క్వార్టర్స్ లో అభినందించారు. ప్రేలుడు పదార్థాలను కనుగొనడంలో ప్రత్యేకంగా శిక్షణ పొందిన షాడో జిల్లా పోలీస్ శాఖలో సేవలందించేందుకు రావడం సంతోషకరమని అన్నారు.పోలీస్ జాగీలం షాడోకి హ్యాండ్లర్ గా వ్యవహరిస్తున్న ఏఆర్ కానిస్టేబుల్ కిరణ్ యాదవ్ ఇతర డాగ్ స్క్వాడ్ అధికారులు, సిబ్బందికి ఎస్పీ పలు సూచనలు చేశారు. ప్రస్తుతం జిల్లా పోలీస్ శాఖలో పనిచేస్తున్న 06 పోలీస్ జాగిలాలకు సంబంధించి పూర్తి వివరాలు అధికారులను అడిగి తెలుసుకున్నారు. జాగిలాల సంరక్షణ, వసతి ఏర్పాట్లలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఎప్పటికప్పుడు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ లు యాదగిరి, మాధుకర్, రమేష్ సిబ్బంది పాల్గొన్నారు.

# జగిత్యాలలో బిఆర్‌ఎస్‌కు దెబ్బ మీద దెబ్బ

**ప్రజాపక్షం/జగిత్యాల రూరల్ :** జగిత్యాల పట్టణంలోని బిఎల్ఎన్ గార్డెన్‌లో మంగళవారం రోజున జగిత్యాల రూరల్ మండల ఎంపిపి మంగళారపు మహేష్, గోపాల్ రావుపేట తిప్పన్నపేట గ్రామ మాజీ సర్పంచ్ రౌతు రాజలింగు, రౌతు గంగాధర్, అంబారిపేట మల్లారెడ్డి, 300 మంది బిఆర్ఎస్ నాయకులు ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి, ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్ కుమార్ సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. కండువా కప్పి పార్టీలోకి ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి, ప్రభుత్వ విప్ లక్ష్మణ్ కుమార్ ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ అడువాల జ్యోతి లక్ష్మణ్, జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు విజయలక్ష్మి దేవేందర్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు జున్ను రాజేందర్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు గాజంగి నందయ్య, అర్బన్ మండల అధ్యక్షుడు శ్రీ రాముల గంగాధర్, మాజీ ఎంపిపి రమేష్, మాజీ సర్పంచులు, ఎంపిటిసిలు, వివిధ హోదాలో ఉన్న కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# సరిహద్దు చెక్‌పోస్టు ప్రారంభం



**ప్రజాపక్షం / ఇబ్రహీంపట్నం :** జగిత్యాల జిల్లా ఇబ్రహీంపట్నం మండలం జిల్లా సరిహద్దు గల గండి హనుమాన్ గుడి వద్ద అంతర్‌జిల్లా చెక్‌పోస్టును మంగళవారం ప్రారంభించినట్లు ఎస్సై అనిల్ తెలిపారు. లోక్‌సభ ఎన్నికల దృష్ట్యా ఎన్నికల కోడ్ రావడంతో చెక్‌పోస్టును ప్రారంభించినట్లు ఆయన వివరించారు. కాగా ఎస్సై అనిల్ ఆధ్వర్యంలో వాహనాల తనిఖీ చేశారు.

# అందరినీ కలుపుకునీపోయి అభివృద్ధికి కృషి చేస్తా




**ప్రజాపక్షం/కరీంనగర్ :** అందరినీ కలుపుకుని పోయి సుడా పరిధిలో అభివృద్ధికి కృషి చేస్తానని నూతనంగా నియమితులైన సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి అన్నారు. గతంలో గిడ్డంగుల సంస్థ చైర్మన్‌గా సంస్థ ఉద్యోగులకు పెన్షన్ సౌకర్యం కల్పించి పొరుగు సేవల ఉద్యోగులకు జీతాలు పెంచి వీలైనంత సహాయం చేశానన్నారు. పిసిసి అధికార ప్రతినిధిగా, నగర కాంగ్రెస్ అధ్యక్షుడిగా నిరంతరం ప్రజల పక్షాన నిలబడ్డానన్నారు. మొన్నటి ఎన్నికలలో అసెంబ్లీ టికెట్ ఇవ్వకున్నా క్రమశిక్షణ గల కార్యకర్తగా పనిచేసానని తెలిపారు. ఏఐసిసి నాయకులు నాకు సముచిత స్థానం కల్పిస్తామని ఇచ్చిన మాట ప్రకారమే సమిష్టి నిర్ణయంతో నాకు పదవి ఇచ్చారన్నారు. గతంలో అనుభవించిన పదవులు మంత్రి పొన్నం ప్రభాకర్ వల్లే జరిగిందన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి బట్టి విక్రమార్క, మంత్రులు పొన్నం ప్రభాకర్, శ్రీధర్‌బాబు, ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి, ఎమ్మెల్యేలు కవ్వంపల్లి సత్యనారాయణ, మేడిపల్లి సత్యం అందరి సహకారం వల్లే సుడా చైర్మన్ నియామకం జరిగిందని పేర్కొన్నారు. గత పదేళ్లుగా అప్పటి ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలపై నిరంతరం పోరాటం చేసి పార్టీ ఇచ్చిన కార్యక్రమాలు విజయవంతం చేయడంలో పనిచేసిన వారందరికీ పదవులు రావాల్సిన అవసరముందన్నారు. సమావేశంలో కొరివి అరుణ్ కుమార్, శ్రావణ్ నాయక్, అఖిల్, కుర్ర పోచయ్య, స్వామిగౌడ్, బొబ్బిలి విక్టర్, ఖంరొద్దీన్, దన్న సింగ్, నెల్లి నరేష్, మెతుకు కాంతయ్య, షెహెన్స, పోరండ్ల రమేష్, గంగుల దిలీప్, కీర్తి కుమార్, షబానా మహమ్మద్, ముల్కల కవిత, జ్యోతి రెడ్డి, ఊరడి లత, మేరాజ్, మహాలక్ష్మి , తిరుమల, మహమ్మద్ భారీ, బషీర్, అష్రఫ్ తదితరులున్నారు.

# ఎటు వెళ్లాలో తెలియక ఇబ్బందులు పడుతున్న ప్రయాణికులు



**ప్రజాపక్షం/కోనరావుపేట :** రాజన్న సిరిసిల్ల జిల్లా కోనరావుపేట మండలంలో సుమారు 30 కిలోమీటర్ల మేర నిజామాబాద్ జిల్లా నుండి సిరిసిల్ల జిల్లాను కలుపుతూ రెండు వరుసల ప్రధాన రహదారులు ఉన్నాయి. ప్రధాన రహదారిని నిర్మించి అలాగే వదిలేయడంతో నిజామాబాద్ జిల్లా నుండి రోజు వందల మంది ప్రయాణికులు వేములవాడలోని దక్షిణ కాశీగా పేరు పొందిన సుప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన శ్రీ రాజరాజేశ్వర స్వామి ఆలయానికి వస్తూంటారు. అంతేకాకుండా రాజన్న సిరిసిల్ల జిల్లాకు వివిధ పనుల నిమిత్తం రహదారిపై చాలా మంది ప్రయాణిస్తూ ఉంటారు. నిజామాబాద్ నుండి వచ్చే ప్రయాణికులు మరిమడ్ల గ్రామంలోని లోతు ఒర్రె దాటిన తరువాత మూలమలుపు వద్ద రెండు ప్రధాన రహదారులు దర్శనమిస్తాయి. ఒకటి వేములవాడ వెళ్లడానికి ఇంకొకటి సిరిసిల్ల జిల్లా కేంద్రానికి రావడానికి రెండుగా చీలి ఉంటాయి. ఇక్కడ సంబంధిత ఆర్అండ్‌బీ అధికారులు సూచిక బోర్డులు ఏర్పాటు చేయలేకపోవడంతో వాహనదారులు ఎటు వెళ్లాలో తెలియక అయోమయానికి గురై ఇబ్బందులు పడుతున్నారు. ఉదయం పూట ఎవరినో ఒకరిని అడిగి వెళ్తున్నామని రాత్రి సమయంలో మాత్రం ఇబ్బంది పడాల్సి వస్తుందని ప్రయాణికులు అంటున్నారు. అంతేకాకుండా సిరిసిల్ల నుండి మరిమడ్ల వరకు రెండు వరుసల ప్రధాన రహదారిపై మూడు కూడలిలు కలిసే చోట అధికారులు సంబంధిత గ్రామాలకు వెళ్లే సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు. రోడ్లపై మూలమలుపుల వద్ద అక్కడిక్కడ ప్రమాదకరంగా ఉండే పెద్ద ప్రచార బోర్డులను ఏర్పాటు చేస్తున్నారు. కానీ ప్రయాణికులకు ప్రజలకు అవసరమయ్యే వాటి మీద సంబంధిత అధికారులు ఎందుకు దృష్టి సారించలేకపోతున్నారని ప్రజలు అనుకుంటున్నారు.

## ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపాం..

ప్రధాన మూలమలుపుల వద్ద సూచిక బోర్డులు ఏర్పాటు చేయడానికి ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపాము. సంబంధిత పనులకు అధికారుల నుండి ఆదేశాలు జారీ కాగానే సూచిక బోర్డులు ఏర్పాటు చేస్తాం. అలాగే రోడ్లపై ఉన్న పెద్ద హోర్డింగ్‌లు ఎవరూ ఏర్పాటు చేశారో తెలియదు. అనధికారికంగా అలాంటి వాటిని ఏర్పాటు చేసినట్లయితే వెంటనే తొలగిస్తాం.

# ఓ వైపు తండ్రి మరణం.. మరో వైపు పది పరీక్షలు

## పుట్టెడు దుఃఖంతో పరీక్షలు రాసిన కవలలు



**ప్రజాపక్షం/పెగడపల్లి :** జగిత్యాల జిల్లా పెగడపల్లి మండలంలో విషాద సంఘటన చోటు చేసుకుంది. కష్టపడి పదోతరగతి పరీక్షలు రాస్తున్న తరుణంలో ఆ విద్యార్థులకు విధి అనుకోని పరీక్ష పెట్టింది. తండ్రి కలను నెరవేర్చాలనుకున్న ఆ కవల పిల్లల శ్రమను చూడకుండానే విధి తండ్రిని దూరం చేసింది. తండ్రి శుక్రవారం పురుగుల మందు తాగి జగిత్యాల ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం ఉదయం మరణించారు. ఆ వార్తను దిగమింగుకుని పదో తరగతి పరీక్షలకు అన్నదమ్ములు హాజరవ్వడం పలువురిని కంటతడి పెట్టించింది. జగిత్యాల జిల్లా పెగడపల్లి మండలంలోని బతికెపల్లి గ్రామానికి చెందిన గాజె చంద్రయ్య వ్యవసాయం చేసుకుంటూ జీవిస్తుండగా అతనికి ఇద్దరు కుమార్తెలు, ఇద్దరు కుమారులు రాము, లక్ష్మణ్ జన్మించారు. బతికపల్లి గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతూ పరీక్షలు వ్రాస్తున్నారు. తండ్రి చంద్రయ్య నాలుగు రోజుల క్రితం క్రిమిసంహారక పురుగుల మందు తాగి ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం తెల్లవారుజామున మరణించాడు. తండ్రి మరణవార్త విని ఇద్దరు కుమారులు బోరున విలపించారు. పుట్టెడు దుఃఖంలోనూ తాము ఉన్నత చదువులు చదివి మంచి స్థాయిలో రావాలనే తమ తండ్రి కలను నెరవేర్చడానికి పదో తరగతి పరీక్షలు వ్రాయాలని గ్రామస్థులు, ఉపాధ్యాయులు ఇచ్చిన మనో ధైర్యం కల్పించడంతో పరీక్ష కేంద్రానికి వెళ్లి పరీక్షకు హాజరయ్యారు. వారిని చూసిన గ్రామస్థులు కంటతడి పెట్టారు.

# పౌష్టికాహార లాభాలపై అవగాహన



**ప్రజాపక్షం / మల్లాపూర్ :** మండల కేంద్రంలోని అంగన్వాడీ కేంద్రాల ఆధ్వర్యంలో పోషణ పక్వాడా కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ శంకరమ్మ పాల్గొని గర్భిణీలు బాలింతలు కిశోర బాలికలకు మిల్లెట్స్, రక్తహీనత, పోషకాహారం తీసుకుంటే కలిగే లాభాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్లు ఇందిర, రాధ, వసంత, భవానీ, రాధ, ఏఎన్ఎం , గర్భిణీలు బాలింతలు పాల్గొన్నారు.

# ఎండిన పంటలను పరిశీలించిన బిఆర్ఎస్ నాయకులు

**ప్రజాపక్షం/చిగురుమామిడి :** చిగురుమామిడి మండలం లంబాడిపల్లి గ్రామంలో ఎండిన వరి పంటలను బిఆర్ఎస్ నాయకులు మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు మామిడి అంజయ్య మాట్లాడుతూ సాగునీరు లేక పంట నష్టపోయిన రైతులను కాంగ్రెస్ ప్రభుత్వం ఆదుకోవాలని, ఎకరానికి యాభైవేల రూపాయల చొప్పున నష్టపరిహారం అందించాలని డిమాండ్ చేశారు. హుస్నాబాద్ ఎమ్మెల్యే మంత్రి పొన్నం ప్రభాకర్ తక్షణమే సంబంధిత శాఖ అధికారులను ఆదేశించి నష్టపోయిన రైతుల పంటలను సర్వే చేయించి రైతులను ఆదుకోవాలన్నారు. ఆయన వెంట రైతులు కాటం మల్లారెడ్డి, చందబోయిన పెద్ద ఎల్లయ్య, కాటం రవీందర్ రెడ్డి, బిఆర్ఎస్ నాయకులు మహంకాళి కొమురయ్య, నాగెల్లి రాజిరెడ్డి, బుర్ర తిరుపతి గౌడ్, చందబోయిన ఎల్లయ్య యాదవ్ తదితరులున్నారు.

# నిరుపేదను ఆదుకోండి..




**ప్రజాపక్షం/ఎల్లారెడ్డిపేట :** ఎల్లారెడ్డిపేట మండలం బండలింగంపల్లి గ్రామానికి చెందిన కొండాపూర్ శేఖర్ గతకొద్ది కాలంగా వెన్నుముక సమస్యతో భాధపడుతున్నాడు.కుటుంబ భారాన్ని మోసే తండ్రి గత కొద్దికాలంగా ఆనారోగ్యంతో భాదపడుతూ చనిపోయాడు. తల్లి పక్షవాతంతో వ్యాధిగ్రస్థులారయ్యింది. నిరుపేద కుటుంబానికి ఆరోగ్యసమస్య తలెత్తడంతో ఆర్థికభారంతో తల్లడిల్లుతున్నాడు. ఎవరైన దాతలు మానవత దృక్పథంలో ఆదుకోవాలని కుటుంబ సభ్యులు కోరుతున్నారు. చేతికందిన కుమారుడు మంచాన పడి ఉండటంతో తీవ్ర మనోవేధనకు గురవుతున్నారు. దాతలు ఫోన్‌పే నంబర్ 9948351824, 91105985901 కు సహాయం చేయాలని వేడుకుంటున్నారు.

# మోగిన ఎన్నికల నగారా..

✲ కోడ్ కూసింది..




**ప్రజాపక్షం/ఎల్లారెడ్డిపేట :** దేశంలో సార్వత్రిక ఎన్నికల నగారా మ్రోగింది.లోక్‌సభ ఏపీతో పాటు అరుణాచల్‌ప్రదేశ్,సిక్కిం.ఒడిస్సా పాటు ఏడు రాష్ట్రల ఎన్నికలకు కేంద్ర ఎన్నికల కమిషన్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది.దీంతో ఎన్నికల కోడ్ కూసినందున పలు రాజకీయ పథకాల పోస్టర్లు వ్యక్తిగత పోస్టర్లను ప్రత్యేక గ్రామపాలక వర్గం మండలంలోని వాల్‌పోస్టర్లను నామ మాత్రంగా తీసివేయిస్తున్నారు.ప్లెక్సీలు,వాల్‌పేయింట్లు వేయరాదని ఎల్లారెడ్డిపేట ప్రత్యేక అధికారి సత్యయ్య తెలిపారు.ఎన్నికలకు సంభందించిన సమాచారం ఎంఆర్‌వో భాద్యతలు వహిస్తారని అన్నారు.ప్రతీపంచాయితీలలో ప్లెక్సిలు తీయడంపై నిర్లక్షవైఖరికి నిదర్శనంగా మారుతోంది.ఎన్నికల నియమావళిని అమలు చేయాలన్న ఆలోచన కలగడం లేదని వాపోతున్నారు.బస్టాండ్‌ల వద్ద,డబుల్‌బెడ్రూం వద్ద,ఎక్కడికక్కడే ప్లెక్సిలు ఉన్నాయి,అధికారులు తీసివేస్తామని అంటుండమే కాని పనులపై శ్రద్ధ కనబర్చడం లేదని పలువురు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు.

# గడ్డిబెండలను దగ్ధంచేసిన వ్యక్తిపై కేసు..

**ప్రజాపక్షం/ఎల్లారెడ్డిపేట :** రాజన్నసిరిసిల్లా ఎల్లారెడ్డిపేట మండలంలోని గొల్లపల్లి గ్రామానికి చెందిన తిరుపతి గడ్డిబెండలను తగలబెట్టాడని ఎల్లారెడ్డిపేట స్టేషన్‌లో డీటిలక్ష్మి శ్రీనివాస్ పిర్యాదు మేరకు కేసు నమోదైంది.గత కొంతకాలంగా తనబావ శ్రీనివాస్ తన బావతో ఆస్తి విషయంలో గొడవలు జరుగుతున్నాయని సమాచారం. సోమవారం రాత్రి 8 గంటల ప్రాంతంలో శ్రీనివాస్ బావ కుమారుడు తిరుపతి గడ్డిబెండలను తగలబెట్టాడని పోలీసుస్టేషన్‌లో పిర్యాదు అవ్వగా కేసు నమోదు చేసినట్లుగా ఎస్సై రమాకాంత్ కేసునమోదు చేశారు.

## ఎన్నికల ప్రవర్తనా నియమావళిని ఉల్లంఘించరాదు

**ప్రజాపక్షం/చిగురుమామిడి :** ఎన్నికల ప్రవర్తనా నియమావళిని ఉల్లంఘించినట్లయితే కఠిన చర్యలు తీసుకోబడునని చిగురుమామిడి ఎస్ఐ బండి రాజేష్ తెలిపారు. 2024 లోక్ సభ పార్లమెంట్ ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చిన దృష్ట్యా ప్రతి ఒక్కరూ ప్రవర్తన నియమావళి లోబడి నడుచుకోవాల్సి ఉంటుందని, రూ.50 వేల కంటే ఎక్కువ నగదు తీసుకెళ్తే సరైన రశీదులు చూపించాలన్నారు. లేనిపక్షంలో అట్టి నగదును స్వాధీనం చేసుకోవడం జరుగుతుందని తెలిపారు. రాజకీయ పార్టీలు ముందస్తు సమాచారం, అనుమతి లేకుండా ఎలాంటి ర్యాలీలు, సభలు, సమావేశాలు నిర్వహించరాదని తెలిపారు. సోషల్ మీడియాలో అభ్యంతరకర, విద్వేషకరమైన రెచ్చగొట్టే సందేశాలు పోస్టు చేసిన వారిపై గ్రూప్ అడ్మిన్లపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎన్నికల నియమావళికి లోబడి ప్రతి ఒక్కరూ పోలీస్‌శాఖకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

జగిత్యాల ఫైల్ నం:2

## కాంగ్రెస్‌లోకి చేరికలు



**ప్రజాపక్షం/జగిత్యాల ప్రతినిధి :** జగిత్యాల పట్టణంలోని బిఎల్ఎన్ గార్డెన్‌లో రూరల్ మండల ఎంపీపీ మంగళవారపు రమేష్, గోపాల్‌రావుపేట, తిప్పన్నపేట గ్రామ సర్పంచ్ రౌత్ రాజలింగ్ రౌత్ గంగాధర్, హస్నాబాద్ మల్లారెడ్డి, 300 మంది బిఆర్ఎస్ నాయకులు జీవన్‌రెడ్డి సమక్షంలో మంగళవారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మన్ కుమార్ ఎంఎల్‌సి జీవన్‌రెడ్డి పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ అడువాల జ్యోతిలక్ష్మణ్, జిల్లా మహిళ కాంగ్రెస్ అధ్యక్షురాలు విజయలక్ష్మీ దేవేంధర్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు జున్ను రాజేంధర్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు గాజంగి నందయ్య, అర్బన్ మండలాధ్యక్షులు శ్రీరాముల గంగాధర్, మాజీ ఎంపీపీ పాల్గొన్నారు.

## క్రిమిసంహారక మందు తాగి వ్యక్తి మరణం

**ప్రజాపక్షం/పెగడపల్లి:** జగిత్యాల జిల్లా పెగడపల్లి మండలంలోని బతికపల్లి గ్రామానికి చెందిన గాజె చంద్రయ్య(55) అనే వ్యక్తి కడుపు నొప్పితో బాధపడుతూ భరించలేక గ్రామ శివారులోని తన వ్యవసాయ భూమిలో శుక్రవారం క్రిమిసంహారక పురుగుల మందు తాగి జగిత్యాల ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం ఉదయం మృతి చెందినట్లు పెగడపల్లి ఎస్ఐ రామకృష్ణ తెలిపారు. అతని బార్య గాజె లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

## అంగన్‌వాడీ కేంద్రంలో పోషణ పక్షం

**ప్రజాపక్షం/కోరుట్ల :** జగిత్యాల జిల్లా కోరుట్ల పట్టణంలోని 23వ వార్డు ఎస్కోని గుట్ట అంగన్‌వాడీ కేంద్రంలో పోషణ పక్షంలో భాగంగా పోషక ఆహారం గురించి వివరించారు. అనంతరం సీమంతాలు, అన్నప్రాసన కార్యక్రమం చేపట్టారు. మిల్లెట్స్ , సాంప్రదాయ ఆహార అలవాట్లు వాటిలో గల పోషక విలువల గురించి వివరించడం జరిగింది. ఈ కార్యక్రమంలో తల్లులు మదర్ కంటి సభ్యులు సూపర్‌వైజర్ ప్రేమలత, అంగన్‌వాడీ టీచర్ బి రజిత, ఆయా పర్వీన్ బేగం పాల్గోన్నారు.

## డాక్టర్ కేర్ హోమియోపతి ఆధ్వర్యంలో థాంక్యూ డాక్టర్




**ప్రజాపక్షం/కరీంనగర్ టౌన్ :** డాక్టర్ కేర్ హోమియోపతి ఆస్పత్రి ఆధ్వర్యంలో మంగళవారం కరీంనగర్‌లోని ఓ హోటల్‌లో డాక్టర్ కేర్ ద్వారా చికిత్స పొంది విజయవంతంగా దీర్ఘకాలిక వ్యాధుల నుంచి బయటపడిన వ్యాధిగ్రస్థులు, వారి కుటుంబ సభ్యులతో కలిసి థాంక్యూ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. వారి అనుభవాలను అందరితో పంచుకున్నారు. కార్యక్రమ ముఖ్య అతిథి డాక్టర్ కేర్ హోమియోపతి చైర్మన్ మేనేజింగ్ డైరెక్టర డాక్టర్ ఏఎం రెడ్డి మాట్లాడుతూ ఆరోగ్యం పట్ల పూర్తి అవగాహన లేకపోవడం వల్ల ఆరోగ్యాన్ని పాడు చేసుకుంటున్నామని తెలిపారు. ఇష్టానుసారంగా మందులు వాడడం వల్ల అనారోగ్యాల పాలవుతున్నారని చెప్పారు. హైదరాబాద్‌లో కంటే కరీంనగర్ జిల్లా కేంద్రాలతో పాటు పట్టణాలు, గ్రామస్థాయిలో అవగాహన పెంపొందించాల్సిన అవసరముందన్నారు. అంతుచిక్కని వ్యాధులు, మందులకు లొంగని రోగాలు వస్తున్నాయని వెల్లడించారు. అన్ని వ్యాధులకు హోమియోపతిలో మందులు ఉన్నాయని తెలిపారు. భవిష్యత్తు తరాలు బాగుండాలనే ఉద్దేశ్యంతో థాంక్యూ డాక్టర్ కార్యక్రమాన్ని ప్రారంభించినట్లు పేర్కొన్నారు. రాష్ట్రంలోని అన్ని జిల్లాలలో నిర్వహిస్తామని తెలిపారు. డాక్టర్ కేర్ సంస్థ ద్వారా జిల్లా ప్రజలకు 10 సంవత్సరాలుగా ఎనలేని సేవలు అందిస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో కరీంనగర్ బ్రాంచి మేనేజర్ డాక్టర్ మానస, డాక్టర్ నీరజ, డాక్టర్ భార్గవి, రమేష్ పాల్గొన్నారు.

## కిందిస్థాయి సిబ్బందిపై ఉన్నతాధికారుల బెదిరింపులు

**ప్రజాపక్షం/బాసర్ :** దక్షిణ భారతదేశంలోనే ప్రాముఖ్యత కలిగిన నిర్మల్ జిల్లా బాసర శ్రీ జ్ఞాన సరస్వతి అమ్మవారి ఆలయంలో విధులు నిర్వహింస్తున్న జునియర్ అసిస్టెంట్ మేకల లక్ష్మణ్ పై ఉన్నత అధికారి ఏఈఓ,సూపరింటెండెంట్ అసభ్య పదజాలంతో కిందిస్థాయి ఉద్యోగులను బెదిరింపులకు గురిచేస్తూ ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని, అది కూడా దర్శనం కొరకు వచ్చిన భక్తుల ముందర అసభ్యకరమైన పదజాలంతో అగ్రహం వ్యక్త చేయడం పట్ల ఈ విషయం మీడియా దృష్టికి కిందిస్థాయి సిబ్బంది తీసుకురావడం జరిగింది.

గత కొంత కాలంగా ఆలయంలో విధులు నిర్వహిస్తున్న లక్ష్మణ్ పై ఉన్నత అధికారులు కక్ష్య సాధింపు చర్యలకు పాలపడుతున్నారని మీడియా ముందు లక్ష్మణ్ ఆవేదనతో కంటతడి పెట్టుకోవడం. సిబ్బందిపై ఉన్నత అధికారులు ఈ రకంగా వ్యవహరించడం పట్ల గ్రామస్తులు కూడా ఆగ్రహం వ్యక్తం చేశారు. ఏది ఏమైనా ఉంటే ఆఫీస్ రూమ్ లో మందలించుకోవాలి కానీ భక్తుల ముందు ఈ రకమైన పదజాలం వాడడం ఇలాంటి అధికారులపై పూర్తి విచారణ చేపట్టాలని, అలాగే కింది స్థాయి ఉద్యోగులైన లక్ష్మణ్ కు న్యాయం చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు.

## సమగ్ర చీడల నివారణపై రైతులకు శిక్షణ



**ప్రజాపక్షం/జగిత్యాల రూరల్ :** జగిత్యాల అర్బన్ మండలంలోని అంబారిపేట రైతు వేదికలో సహాయ వ్యవసాయ సంచాలకులు ఎన్. ప్రియదర్శిని రైతులకు వరి పంటని ఆశించు పురుగుల సమగ్ర నివారణకు తీసుకోవాల్సిన చర్యలను విపులంగా వివరించారు. విత్తన ఎంపిక విత్తన శుద్ధి ఆవశ్యకత, రూట్ డిప్ పద్ధతి ద్వారా పిలక దశలో మొగి పురుగు నివారణ, నాటే దూరం, నాటు విధానం మొక్కల సాంద్రత మెళకువలు, కాలి బాటల వలన పురుగుల ఉధృతి తగ్గించడం, కలుపు మొక్కల నివారణ ఆవశ్యకత, మిత్ర పురుగుల సంరక్షణ వల్ల ఉపయోగాలు, ఎరువుల రకాఅలు, వినియోగ విధానం, ఎరువుల వినయోగ సామర్థ్యం పెంచే విధానాలు, డిఏపి కరిగించే పిఎస్‌బి వాడకం విధానం, పద్ధతులు, వరి కోత సమయంలో తీసుకోవాల్సిన చర్యలు కోత అనంతరం కొయ్యకాలు కాల్చడం వల్ల జరిగే నష్టాలు, లోతు దుక్కుల వల్ల కలిగే లాభాలు, పైన అంశాల మీద వివరంగా రైతుకు అన్ని రకాల పద్ధతు పాటించి పంటలో పురుగులను సమర్థవంతంగా నిర్మూలించవచ్చని తెలియజేశారు.ఈ కార్యక్రమంలో స్థానిక మండల వ్యవసాయ అధికారి బి. వినీల, వ్యవసాయ విస్తరణ అధికారి డి. నాగరాజు రైతులు పాల్గొన్నారు.

## వైభవంగా శివపార్వతుల కళ్యాణం



**ప్రజాపక్షం / మల్లాపూర్ :** మండలంలోని పాదదామరాజుపల్లి గ్రామంలో భక్త మార్కండేయ ఆలయంలో శివపార్వతుల కళ్యాణ మహోత్సవాన్ని మంగళవారం అత్యంత వైభవంగా జరిపించారు. స్వామివారి కళ్యాణానికి ముందు ఉత్సవ మూర్తులను డప్పు చప్పుళ్లతో మహిళల మంగళహారతులు మధ్య ఊరేగింపు చేపట్టి వేద పండితుల మంత్రోచ్చరణల మధ్య స్వామివారి కళ్యాణాన్ని కనుల పండువగా జరిపించారు. కాగా కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జ్ నర్సింగరావు కళ్యాణంలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించగా ఆలయ కమిటీ సభ్యులు శాలువాతో ఘనంగా సన్మానించారు. అనంతరం కళ్యాణంలో పాల్గొన్న భక్తులకు మహా అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో మార్కండేయ సంఘం నాయకులు దావనపెల్లి ప్రతాప్, రాము దశరథం, కాంగ్రెస్ నాయకులు రొండ్ల రాజిరెడ్డి, నారాయణ రెడ్డి, మోహన్ రెడ్డి, కొమ్ముల చిన్నా రెడ్డి, రవి, ఆనంద్ గౌడ్ ఉన్నారు.

## ఘనంగా ప్రాచీన శ్రీ కృష్ణ ఆలయ వార్షికోత్సవం..



**ప్రజాపక్షం/కుంటాల :** కుంటాల మండల కేంద్రంలోని ప్రాచీన శ్రీకృష్ణ ఆలయంలో ఎనిమిదవ వారికోత్సవాన్ని ఆలయ పూజారి శ్రీకాంత్ ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు.ఉదయం 5 గంటల నుండి మొదలుకుని అభిషేకం,హారతి, శ్రీలక్ష్మి అష్టోత్తర శత నామ స్తోత్రము,విష్ణు సహస్ర నామం భగవద్గీత పారాయణం తదితర పూజ కార్యక్రమాలు నిర్వహించారు.అనంతరం అప్కా గజ్జారాంసుజాత ఎంపీపీ దంపతులు భకులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలను స్వీకరించారు. గ్రామ పెద్దలు,భక్తులు తదితరులు పాల్గొన్నారు.

## రెవెన్యూ అధికారులకు కట్నాలు తప్ప... ఇసుక డంపులు కనిపించవా...?



**ప్రజాపక్షం/జగిత్యాల రూరల్ :** అధికారులకు కట్నాలు తప్పా ఇసుక డంపులు కనిపించవా.. జగిత్యాల అర్బన్, రూరల్ మండలంలోని గ్రామాలలో వందకు పైగా ఇసుక డంపులు దర్శనమిస్తున్నాయి. ఐనా రెవెన్యూ అధికారులు ఎవరి పనులు వారు చేసుకుని పోతారు. మధ్యలో మనం వెళ్లడం ఎందుకు కట్నాలు రాకుండా చేసుకోవడం అన్నట్లుగా ఉంది జగిత్యాల అర్బన్, రూరల్ రెవెన్యూ అధికారుల తీరు. ఎక్కడెక్కడ నుండో అనుమతులు లేని ప్రదేశాల నుండి ఇసుకను వేకువజాము, అర్ధరాత్రి సమయాలలో దిగుమతి చేసుకోవడం పంట పొలాల మధ్యలో, ఇండ్ల మధ్యలో గ్రామాల పొలిమెరల దగ్గర ఇసుక డంపులు ఏర్పాటు చేసుకోవడం ఇసుక మాఫియాకు బాగా కలిసివస్తుందని సమాచారం. జగిత్యాల అర్బన్, రూరల్ గ్రామాలలో ఇసుక మాఫియాకు రెవెన్యూ అధికారులే పురుడు పోసి పేరు పెట్టారన్నట్లు వారి పనితనం ఉందని గ్రాఆమలలో ఇండ్లు కట్టుకునే మధ్యతరగతి వాళ్లు వాపోతున్నారు. జగిత్యాల, పరిసర గ్రామాలలో ఇసుకకు మంచి గిరాకీ ఉందని కాలంతో సంబందం లేకుండా సంవత్సరం మొత్తం ఇసుకతో పని ఉంటుందని ఇసుక రెగ్యులర్‌గా అమ్ముడుపోయే ఇంధనం లాంటిదని, ఇసుక డంపులు ఎన్ని పోసుకున్న అనేవారు అడిగేవారు ఉండరటా..? ఎందుకంటే జగిత్యాల అర్బన్, రూరల్ గ్రామాలలో ఇసుక మాఫీయాను మాజీ సర్పంచులు, మాజీ, ప్రస్తుత ఎంపిటిసిలు, గ్రామ పాలకవర్గ సభ్యులు, పలు పార్టీల మండల, గ్రామ యూత్ అధ్యక్షులు కీలకంగా వ్యవహరిస్తున్నారని పలు గ్రామాల ప్రజలు అంటున్నారు. ఎవరైనా ప్రశ్నిస్తే వారికి గ్రామాలలో ఇబ్బందులకు గురి చేస్తున్నారనే ఆరోపణలు కూడా మూటగట్టుకుంటున్నారు. ఈ విధంగా మాజీ సర్పంచులు, మాజీ, ప్రస్తుత ఎంపిటిసిలు, గ్రామ పాలక వర్గ సభ్యులు, పలు పార్టీల మండల, గ్రామ యూత్ అధ్యక్షులు అందరూ కలిసికట్టుగా చేయడం పలు పార్టీలకే సిగ్గు చేటు అని గ్రామాలలో చర్చించుకుంటున్నారని తెలిసింది. ఇసుక డంపులు ఒక్కో రేటుకు ఒక్కొ డంపును కేటాయించుకుని ఇసుక డంపులను చూపిస్తూ మరి బేరాలు చేస్తున్నారు. అంటే ఇసుక మాఫీయ ఎంత ఘోరంగా తయారు అయ్యిందో అర్థం చేసుకోవచ్చు. జగిత్యాల పరిసర గ్రామాలలో ఇసుక అక్రమంగా నిల్వ చేసి ఒక్క ట్రాక్టర్ ట్రిప్పుకు ఐదువేలకు పై మాటేనటా.... రోజుకు లక్షలలో ఇసుక దందా జోరుగా సాగుతుందని గ్రామాల ప్రజలు చెప్తున్నారు.

### ఇసుక మాఫియాపై స్పందించని జగిత్యాల ఉన్నత స్థాయి అధికారులు

ఇసుక మాఫియా అరికట్టేందుకు ప్రభుత్వం తక్కువ మొత్తంలో ఇసుకను అందించాలని ఇసుక పాలసీని తీసుకువచ్చి ప్రజలను మోసం చేస్తున్న వారికి కళ్లెం వేయాలని చూస్తే జగిత్యాల అర్బన్, రూరల్ అధికారులు అండదండలతో మరి కొందరు ఇసుకను అక్రమంగా నిల్వచేసి అమాయకపు ప్రజల దగ్గర నుండి అధిక మొత్తంలో పైసలు వసూలు చేస్తున్నారని అక్రమ ఇసుక నిల్వ డంపులను అరికట్టి రెవెన్యూ అధికారులు అటువైపు చూడకుండా ఉంటున్నారని పలువురు విమర్శిస్తున్నారు. తోటి కోడళ్లు కలిస్తే అవతలి వారి పని అంతే అన్నట్లుగా రెవెన్యూ అధికారులు ఇసుక దందాలు చేసేటోళ్లు కలిసి మధ్యతరగతి వారి పొట్ట కొడుతున్నారు. జగిత్యాల అర్బన్, రూరల్ గ్రామాలలో దాడులు నిర్వహిస్తే ఒక్కో గ్రామంలో పదుల సంఖ్యలో ఇసుక డంపులు సీజ్ చేయవచ్చని గ్రామాలలో ప్రజలు తెలిపారు. అక్రమంగా ఇసుక డంపుల నిర్వహిస్తున్న వారిపై చర్యలు తీసుకోవడం లేదని మండల స్థాయి అధికారులపై జగిత్యాల జిల్లా ఉన్నత అధికారులు ఎలాంటి ఒత్తిడి తీసుకురాకపోవడమే ముఖ్య కారణమని ఇసుక మాఫియ మూడు కాయలు ఆరు పండ్లలాగా సాగుతుందని జిల్లా ఉన్నత స్థాయి అధికారులపై ప్రజలు మండిపడుతున్నారు. జిల్లా అధికారులు మండల స్థాయి అధికారులు పనితీరుపై సరిగా లేదని పలుమార్లు పలు పత్రికలలో ప్రచురించినా కూడా జిల్లా ఉన్నత స్థాయి అధికారులు ఇసుక మాఫీయాపై మాట కూడ అనకుండా ఉండడం పలు సందేహాలకు దారి తీస్తుంది. ఇకనైనా జగిత్యాల జిల్లా ఉన్నత స్థాయి అధికారులు నోరు తెరిచి మాట్లాడి మండల స్థాయి అధికారులపై ఒత్తిడి చేస్తే తప్ప ఇసుక మాఫీయా, ఇసుకను అక్రమంగా నిల్వ చేస్తున్న డంపులు అడ్డుకట్ట పడదని పలువరు అంటున్నారు.